సాక్షి బాపట్ల

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలం ఉప్పరపాలెం గ్రామ పోలేరమ్మ తిరునాళ్ల సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా పూజలు నిర్వహించారు.



వైద్య కళాశాలలో స్పోర్ట్స్ వీక్

గుంటూరుమెడికల్ : గుంటూరు వైద్య కళాశాలలో స్పోర్ట్స్ వీక్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి సోమవారం ప్రారంభించారు. అనంతరం చెస్ ఆడారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి:దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడ కేటీరోడ్డుకు చెందిన ఎస్.పరాస్ కుటుంబం సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించింది.

న్యూస్‌రీల్

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు స్వాగతం



గుంటూరుఎడ్యుకేషన్: సోమవారం గుంటూరుకు వచ్చిన మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్ వద్ద గుంటూరు ఆర్డీఓ ఎం.ప్రభాకర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. భాష్యం విద్యాసంస్థ ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో పాల్గొన్న వెంకయ్యనాయుడు అనంతరం గుంటూరు నుంచి కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు బయలుదేరి వెళ్లారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దరఖాస్తులకు ఆహ్వానం

బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందేందుకు ఈ నెల 23వ తేదీ నుంచి 28 వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతోందని జిల్లా విద్యా శాఖ అధికారి పి.వి.జె.రామారావు సోమవారం తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారుల ద్వారా, ఉన్నత పాఠశాలలు ఉపాధ్యాయులు ఉప విద్యాశాఖాధికారుల ద్వారా, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు



క్రోసూరు: టీటీడీ ఆధ్వర్యంలో క్రోసూరు మండలంలో కల్యాణం మండపం నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. క్రోసూరులో ఎకరం స్థలం తోపాటు, మంజూరైన గ్రాంటులో 20 శాతం షేర్ ధనాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. త్వరగా కల్యాణ మండపం నిర్మాణం చేపట్టేందుకు ఎమ్మెల్యే స్థలాల పరిశీలన ప్రారంభించారు. క్రోసూరు–అమరావతి రోడ్డులో 4.81 ఎకరాలు, పక్కనే 0.78 సెంట్ల దేవదాయశాఖకు చెందిన వీరభద్రమల్లికార్జునస్వామి దేవస్థానం భూమిని పరిశీలించారు. దేవదాయశాఖ అనుమతులు ఇచ్చిన వెంటనే నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.


కాపు నేస్తం కింద 13,405 మందికి రూ.20.11కోట్లు

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో 13,405 మంది కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాలకు చెందిన మహిళలకు కాపు నేస్తం పథకం కింద రూ.20.11కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్నట్లు జిల్లా బీసీ కార్పొ రేషన్ పీడీ డి.దుర్గాభాయి సోమవారం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా కులాలకు చెందిన 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్యనున్న మహిళలకు ఏడాదికి రూ.15వేలు చొప్పున ఐదేళ్లకు రూ.75వేలు అందజేస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఒకటి, రెండు, మూడు విడతలుగా జిల్లాలోని 31,569 మందికి రూ.45.39 కోట్లు అందజేశారన్నారు. ఈనెల 30వ తేదీన తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో జరిగే కార్యక్రమంలో నాల్గవ విడత నిధులు మంజూరు చేస్తారని ఆమె తెలియచేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 521.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 10,192, ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 858.90 అడుగుల వద్ద ఉంది.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 120, బ్యాంక్ కెనాల్‌కు 1290, తూర్పు కెనాల్‌కు 563, పశ్చిమ కెనాల్‌కు 130, నిజాంపట్నం కాలువకు 245, కొమ్మమూరు కాల్వకు 1983 క్యూసెక్కులు విడుదల చేశారు.

పాఠశాలలకు మెరుగులు

- రెండో దశ పీఎం–శ్రీకి దరఖాస్తులు ఆహ్వానం
- బాపట్ల జిల్లాలో 368 పాఠశాలలకు అర్హత
- ఎంపికైన వాటికి కేంద్రం సహకారం



పీఎం–శ్రీ మొదటి దశలో ఎంపికైన పాఠశాల్లో మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

బాపట్లఅర్బన్: మనబడి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం స్వీకారం చుట్టింది. పాఠశాలలను భౌతికంగా అభివృద్ధి చేయడంతోపాటు విద్యాపరంగా గుణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనబడి నాడు–నేడు మాదిరిగానే ఇప్పుడు కేంద్రం కూడా ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం– శ్రీ) పథకాన్ని గత విద్యా సంవత్సరం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు హై క్వాలిటీ విద్యను అందించనున్నారు. యూ 2021–22 ద్వారా విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని ఈ పాఠశాలలను ఎంపిక చేస్తున్నారు. ఎంపిక చేసిన పాఠశాలలోని విద్యార్థులు సమగ్ర ప్రగతి లక్ష్యంగా వాటికి నేరుగా నిధులు అందజేసే పీఎం శ్రీ పథకం తొలి విడతగా బాపట్ల జిల్లా నుంచి 24 పాఠశాలలు ఎంపికయ్యాయి. జిల్లా స్థాయిలో ఈ పథకానికి జిల్లా విద్యాశాఖ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

విడతలవారీగా నిధులు

పీఎం– శ్రీ పథకంలో దరఖాస్తు చేసుకున్న పాఠశాలను నిపుణుల కమిటీ ద్వారా ఎంపిక చేస్తారు ఎంపికైన పాఠశాలలకు విడతల వారీగా నేరుగా నిధులు అందజేస్తారు. ఈ నిధులతో విద్యార్థులకు అవసరమైన సాంకేతిక సాధనాలను ఆయా పాఠశాలలు సమకూర్చుకోవచ్చు. డిజిటల్ పద్ధతిలో బోధన ప్రయోగశాలలో తదితర సౌకర్యాలు కల్పిస్తారు. ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఎంపికైన పాఠశాలలకు ఐదేళ్ల వరకు ఆర్థిక సాంకేతిక సహకారం లభిస్తాయి. ఎంపికైన పాఠశాలలను పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ స్కూలుస్‌గా మార్చాల్సి ఉంటుంది. లైట్లు ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి స్వయంగా సేంద్రియ విధానంలో కూరగాయలు, ఆకుకూరలు పండించాలి. పాఠశాలలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి. వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యర్థాల నిర్వహణ వంటివి చేయాల్సి ఉంటుంది. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సంప్రదాయ విధానాలను విద్యార్థులకు నేర్పించాల్సి ఉంటుంది.

జిల్లాలో పరిస్థితి ఇది..

పీఎం–శ్రీ పథకం రెండోదశ కింద బాపట్ల జిల్లాలోని 368 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దరఖాస్తుకు అర్హత సాధించాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 283, ప్రాథమికోన్నత 41, ఉన్నత పాఠశాలలు 44 ఉన్నాయి. గ్రామీణ ప్రాంతం నుంచి 332, పట్టణ ప్రాంతాల నుంచి 36 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అనంతరం వచ్చే మార్కులు ఆధారంగా ఆయా పాఠశాలలు పీఎం–శ్రీ పథకానికి ఎంపిక అవుతాయి.

దరఖాస్తు చేయాలి ఇలా..

- స్టెప్ –1లో భాగంగా పాఠశాలలు రిజిస్ట్రేషన్ చేయాలి.
- స్టెప్–2లో పరిశీలన ప్రక్రియ ఉంటుంది. హెచ్‌ఎం లాగిన్‌లో పీఎంశ్రీ పోర్టల్ నమోదు చేసిన వెంటనే ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది దాని ద్వారా లాగిన్ అయిన తర్వాత అందులో ఉన్న పేర్కొన్న 42 అంశాలను పూర్తి చేయాలి.
- హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి విద్యార్హత పత్రాలను అప్‌లోడ్ చేయాలి.
- కేంద్ర విద్యాశాఖ ఆయా పాఠశాలలకు మార్కులు వేస్తుంది.

వేగవంతం చేయాలి



పీఎం శ్రీ పథకంలో రెండో దశకు ఎంపికైన పాఠశాలల జాబితాను ఆయా మండలాల విద్యాశాఖ అధికారులకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపించాం. పీఎం– శ్రీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే విధానంపై ఎంఈఓలకు, ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే వెబెక్స్ నిర్వహించాం. ఈ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో అన్ని సౌకర్యాలతో విద్య అందుబాటులోకి వస్తుంది. ఆన్‌లైన్‌లో పాఠశాలలు దరఖాస్తు చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలి.

– డాక్టర్ బిల్లా మోజెస్, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, సమగ్ర శిక్ష, బాపట్ల.

- గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు 60 శాతం , పట్టణాల్లోని పాఠశాలలో 70శాతం మార్కులు సాధిస్తే ఈ పథకాన్ని అర్హత పొందుతాయి.
- ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా సాగుతుంది.

ఎంపిక చేస్తారిలా...

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల నిర్వహణలోని అన్ని పాఠశాలలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. మూడంచెల ప్రక్రియ ద్వారా పాఠశాలను ఎంపిక చేస్తారు. నిర్దేశిత ఫార్మేట్లో సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

జియో ట్యాగింగ్ చేసి కార్యకలాపాలను సమర్పిస్తారు. ఈ పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్ ఓపెన్ అయిన సమయంలో మాత్రమే పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే పక్కా భవనం బాలురు, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఆటస్థలం తదితర కొన్ని వసతులు ఆయా పాఠశాలల్లో కచ్చితంగా ఉండాలి. పీఎం శ్రీలో ఎంపికైన పాఠశాలలో హెచ్‌ఎంలు చేపట్టాల్సిన పనులపై జిల్లా విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం ఉంటే చర్యలు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- రేపల్లె విద్యుత్ శాఖ ఏఈ సస్పెన్షన్‌కు ఆదేశం
- ఏడీకి షోకాజ్ నోటీసులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్, డీఆర్వో లక్ష్మీశివజ్యోతి

బాపట్ల: స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ పంచాయతీరాజ్, జిల్లా పంచాయతీ అధికారి, సీపీడీసీఎల్ శాఖలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారులు స్పందన అర్జీలు రీ ఓపెన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్పందన అర్జీలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన రేపల్లె విద్యుత్ శాఖ ఏడీకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని, రేపల్లె విద్యుత్ శాఖ ఏఈని సస్పెండ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్.శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి, సీపీఓ భరత్‌కుమార్, డీపీఓ రాంబాబు, డ్వామా పీడీ శంకర్‌నాయక్, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్థక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్య శాఖ జేడీ సురేష్, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, పౌర సరఫరాల శాఖ అధికారి విల్లేమ్స్, డీఎం శ్రీలక్ష్మి, బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఈపురుపాలెం ఇందిరానగర్ కాలనీ చెందిన ఎం.పాండురంగారావు మగ్గం పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొందరు మట్కా, నంబర్లాట, షేర్ ఆటలు ఆటడం చూసి జూదానికి అలవాటు పడ్డాడు. చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. పెద్దఎత్తున అప్పులు కావడంతో ఎవ్వరికి చెప్పకుండా ఇల్లు, కుటుంబాన్ని వదిలి వేసి వెళ్లి పోయాడు.

రామకృష్ణాపురం గ్రామ పంచాయతీకి చెందిన కే యోగేంద్రరావు రోజువారి కూలీ. కొంత కాలంగా షేర్, నంబర్లాట జూదంలో ఇరుక్కుపోయాడు. ఫలితంగా ఉన్న ఇంటిని సైతం అమ్మకం చేసి జూదంలో పోశాడు. ఇలాంటివి ఎన్నో కన్నీటి గాథలు ఉన్నాయి. నియోజకవర్గంలోని ఈపురుపాలెం, తోటవారిపాలెం, పేరాల, జాండ్రపేట, దేశాయిపేట, పందిళ్లపల్లి, తదితర ప్రాంతాల్లో జూదం జోరుగా సాగుతుంది.

‘షేర్’ దోపిడీ

- పేదల రక్తాన్ని పిండుతున్న ఏజెంట్లు
- జూదం ఆడేవారికి ప్రత్యేక కోడ్ భాష
- పట్టించుకోని పోలీసులు



చీరాల: సాంకేతికత పెరిగే కొద్ది మోసాలు పెరుగుతూనే ఉన్నాయి. ఎక్కడో ఒక చోట నిత్యం ఆన్‌లైన్ జూదం మనుషుల ప్రాణాలను తీస్తోంది. ఒకసారి అలవాటు అయితే అందులో నుంచి బయటపడటం కష్టం. షేర్ మార్కెట్ ఆధారంగా జూదం జోరందుకుంది. సెన్సెక్స్‌లో చివరి అంకె.. నిఫ్టీలో చివరి అంకెను కలిపి ఒక సంఖ్యగా లెక్కిస్తున్నారు. ఈ రెండు సంఖ్యలు కలిపి లెక్కించగా 90 వస్తే బెట్టింగ్ పెట్టిన వ్యక్తికి 60 రెట్లు అధికంగా డబ్బులు చెల్లిస్తామని ఆశ పెట్టి పేదల రక్తాన్ని జలగల్లా తాగుతున్నారు. షేర్ మార్కెట్ ఆధారంగా నిర్వహించే ఈ జూదాన్ని ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. ఈ ఆట గ్రామీణ ప్రాంతాల్లో జోరుగా జరుగుతూనే ఉంది.

కార్మికులే టార్గెట్..

చీరాల మండలం దేవినూతల నుంచి వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామం వరకు ఎక్కువగా నివసించేది పేదలే. వీరంతా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారే. వీరంతా అత్యాశకు పోయి ఈ ఆటల్లో డబ్బులు వెచ్చిస్తున్నారు. పేదలు అప్పుల పాలు అవుతుండగా బుకీలు, ఏజెంట్లు మాత్రం లక్షలు గడిస్తున్నారు. రూ.100 పెట్టుబడి పెడితే రూ.5వేలు వస్తాయనే ఆశలు కల్పించి పేదలు ఈ ఆటల వైపు మొగ్గు చూపేలా గ్రామాలు, వార్డుల్లో ఏజెంట్లు ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నారు. షేర్ మార్కెట్ జరిగే ప్రతి రోజూ ఈ జూదం జోరుగా జరుతుంది. సెలవు రోజుల్లో మాత్రం జూదగాళ్లు ఔసీ అనే ఆటలు ఆడుతున్నారు. జూదంలో పెట్టుబడి పెట్టే వారికి అసలు విజేతగా ఎలా నిర్ణయిస్తారో కనీసం అవగాహన లేకపోవడంతో ఏజెంట్లు మా యమాటలతో పేదలు ఆర్థికంగా చితికిపోతున్నారు.

నెంబర్లతో గారడీ..

పలానా వ్యక్తికి ఈ జూదంలో రూ.500 పెట్టుబడి పెడితే రూ.30 వేలు వచ్చాయని ప్రచారం చేసుకుని రోజుకు లక్షల్లో దోపిడీ చేస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో ముఖ్యంగా ఈపురుపాలెం, తోటవారిపాలెం, 300 కాలనీ, జాండ్రపేట, పేరాల, వేటపాలెం తదితర ప్రాంతాల్లోనే ఈ జూదం నడుస్తుంది. పోతే రూ.500 వస్తే రూ.30 వేలు అనే భావనతో ఎక్కువ మంది పేదలు ఈ జూదంలో డబ్బులు కట్టి అప్పులు పాలవుతున్నారు. ఈ జూదంలో డబ్బులు కట్టే వ్యక్తి సాయంత్రం షేర్ మార్కెట్‌లో ఆఖరున పలానా నెంబర్ వస్తుందని బెట్టింగ్ కడుతాడు. ఇందుకు ముందుగానే ఏజెంట్‌కు డబ్బులు చెల్లించి ఒక పేపర్ తీసుకుంటాడు. ఒకవేళ తాను కట్టిన నెంబర్ (అరుదుగా వస్తుంది) షేర్ మార్కెట్ ఆఖరున వస్తే డబ్బులు చెల్లిస్తారు ఏజెంట్లు. లేకపోతే కట్టిన డబ్బులు హుష్ కాకి. జూదం ఆడేవారి కోడ్ భాష కూడా ప్రత్యేకంగా ఉంటుంది. నియోజకవర్గంలో నెలకు రూ.5 కోట్లకు పైనే దోపిడీ జరుగుతుందని సమాచారం. ఒక్కో ఏజెంట్ రోజుకు రూ.10 వేల వరకు సంపాదిస్తున్నాడు, ఇలా నియోజకవర్గంలో 300 మంది వరకు ఏజెంట్లు, బుకీలు ఉన్నారని సమాచారం.

కార్మికుల సొమ్ము కాబూలీల పరం..

ఈ వ్యసనానికి బానిసలైన కార్మికులు అధిక వడ్డీలకు కాబూలీల నుంచి డబ్బులు తెచ్చి మరీ జూదంలో పెడుతున్నారు. రూ.100కు వడ్డీ రూ.20కి తెచ్చి మరీ జూదం కాస్తున్నారు. కాబూలీలు, ఇతర ఫైనాన్స్ సంస్థల నుంచి వారం వడ్డీకి డబ్బులు తెచ్చి జూదం ఆడుతూ ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు.

ఫిర్యాదులు అందలేదు




నంబర్ల ఆట, ఇతర జూదాలపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఎవరైనా పేదలను అధిక డబ్బులు ఆశ చూపి జూదాలకు పాల్పడుతుంటే సమాచారం అందించడండి. అసాంఘిక కార్యకలాపాల కట్టడికి చర్యలు తీసుంటాం.

– జనార్దన్, రూరల్ ఎస్‌ఐ

సముద్రంలో గల్లంతైన వారి మృతదేహాలు లభ్యం





ఘటనా స్థలంలో మృతదేహాలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు తదితరులు (ఇన్‌సెట్) చిన్నారి కొక్కిలిగడ్డ తరుణేశ్వర్ మృతదేహం

నిజాంపట్నం(రేపల్లె): బాపట్ల జిల్లా, నిజాంపట్నం హార్బర్ సమీపంలో ఆదివారం మరబోటు బోల్తా పడిన ఘటనలో గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయని ఎస్‌ఐ రమేష్ తెలిపారు. నిజాంపట్నం తీరానికి మృతదేహాలు సోమవారం కొట్టుకువచ్చాయన్నారు. కృష్ణాజిల్లా నాగాయలంక మండలం ఈలచెట్లదిబ్బ గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ సోంబాబు తన భార్య సాయివర్థిక(29), ఇద్దరు కుమారులు తనిష్‌కుమార్(9), తరుణేశ్వర్(11నెలలు)లను వెంట తీసుకుని తన గ్రామం నుంచి అత్తవారి ఊరైన ముత్తాయిపాలెంనకు వేట చేసుకుంటూ బయలుదేరాడు. వేటలో దొరికిన మత్స్య సంపదను నిజాంపట్నంలో విక్రయించుకుని వెళ్లేందుకు హార్బర్‌కు వస్తున్న సమయంలో మొగ వద్ద అలలు ఉధృతంగా ఉండటంతో బోటు బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో సోంబాబు భార్య సాయివర్థిక, కుమారులు తనిష్ కుమార్, తరుణేశ్వర్ గల్లంతయ్యారు. అదే సమయంలో సోంబాబు సముద్రంలో ఈదుతుండగా దగ్గరలో వేట చేస్తూ వస్తున్న మత్స్యకారులకు కనిపించటంతో అతన్ని రక్షించారు. గల్లంతైన ముగ్గురి కోసం మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్ల గాలింపు చర్యలు చేపట్టారు. తరుణేశ్వర్ మృతదేహం నిజాంపట్నం హార్బర్ సమీపంలో మత్స్యకారులు ఏర్పాటు చేసిన వలలకు చిక్కుకుని కనిపించగా, సాయివర్థిక, తనిష్ కుమార్ మృతదేహాలు నిజాంపట్నం హార్బర్ సమీపంలో బాపట్ల తీరం వైపునకు కొట్టుకువచ్చాయి. మృతదేహాలకు పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎంపీ మోపిదేవి

హార్బర్ సమీపంలో మరబోటు బోల్తా పడి ముగ్గురు మృత్యువాత పడిన సంఘటన హృదయ విదారకమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. సంఘటన స్థలాన్ని సోమవారం పరిశీలించి ప్రమాదంలో మృతి చెందిన సాయివర్థిక తోపాటు ఇద్దరు చిన్నారుల మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఘటనలో మృతి చెందిన వారి కుటుంబానికి ప్రభుత్వపరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వ్యక్తిగతంగా మృతుల కుటుంబానికి రూ.50 వేల నగదు అందించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీ మోపిదేవి వెంట బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

23 శాతం ఫిట్‌మెంట్ అమలుపై హర్షం

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



రేపల్లెరూరల్: రాష్ట్రంలోని సెర్ప్ ఉద్యోగులకు 23 శాతం ఫిట్‌మెంట్ అమలుచేస్తూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవటం ఆనందదాయకమని సెర్ప్ జేఏసీ ఛైర్మన్ కొమ్ము నాగరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు వ్యక్తిగత కార్యాలయంలో ఆయన్ని కలసి సెర్ప్ సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. సెర్ప్ సిబ్బందికి పేస్కేల్ అమలు చేయాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీ మోపిదేవిని కోరారు. స్పందించిన ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ సెర్ప్ సిబ్బంది వినతిని జగనన్న దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీహెచ్ సాల్మన్, పూర్ణా, కోటేశ్వరరావు, దాసు,శిరీష, నాగకుమారి, మేరి, దేవీప్రసన్న, నూరున్నీసా తదితరులున్నారు.

రైతులకు ప్రయోజనం కల్పించేలా ఉత్పత్తి సంఘాలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: రైతులకు మరింత ప్రయోజనం కల్పించేలా రైతు ఉత్పత్తి సంఘాలు ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. నాబార్డు ఆధ్వర్యంలో నడుస్తున్న రైతు ఉత్పత్తి సంఘాల నిర్వహణ, నూతన సంఘాల నిర్మాణంపై స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. రైతు ఉత్పత్తి సంఘాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. నాబార్డ్ ఆధ్వర్యంలో 17 రైతు ఉత్పత్తి సంఘాలు నడుస్తున్నాయని వివరించారు. ఎఫెర్ట్ సంస్థ కింద జిల్లాలో 40 రైతు ఉత్పత్తి సంఘాలు(ఎఫ్.పి.ఓ.) నడుస్తున్నాయని చెప్పారు. సెర్ప్ సంస్థ కింద మూడు రైతు ఉత్పత్తి సంఘాలు కొనసాగుతున్నాయన్నారు. పదివేల సంఘాలు నాబార్డ్ ఆధ్వర్యంలో ఏపీలో స్థాపించాలని లక్ష్యంగా ఉందన్నారు. సంబంధితశాఖ అధికారులు, బ్యాంక్ అధికారులు సహకరించాలన్నారు. కొల్లూరు, పర్చూరు, వేమూరు, మార్టూరు, అద్దంకి ప్రాంతాలలో నూతన క్లస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నూతనంగా ఏర్పాటయ్యే ఒక్కొక్క సంఘానికి రూ.25 లక్షలు ఆర్థిక సహాయాన్ని నాబార్డు అందిస్తుందన్నారు. గో ఆధారిత సీబీబీఓ సంస్థ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. వాటిపై స్పష్టమైన నివేదిక అందజేయాలని సూచించారు నూతన సంఘాల ఏర్పాటు, వారి నుంచి వచ్చే ఉత్పత్తులు, మార్కెటింగ్ అంశాలు సాధ్యాసాధ్యాలపై సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలన్నారు. నాబార్డ్ డీడీఎం శరత్, ఎల్‌డీఎం కృష్ణా నాయక్, పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ హనుమంతరావు, మత్స్య శాఖ అధికారి పి సురేష్, సహకార శాఖ అధికారి రామారావు, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు జె.జెన్నమ్మ పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల పునరుద్ధరణ

జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద అధ్యాపకుల పునరుద్ధరణను కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆమోదించారు. ఒప్పంద అధ్యాపకుల పునరుద్ధరణపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. అనంతరం ఒప్పంద అధ్యాపకుల పునరుద్ధరణను ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని అన్నారు. జిల్లా స్థాయి కమిటీ కన్వీనర్, వైఏజీసీడబ్ల్యూఏ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సీహెచ్ రవణమ్మ, అద్దంకి డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు మోహన్‌రావు, బాపట్ల కళాశాల ప్రధానాచార్యులు కె మాల్యాద్రి పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై సత్వర విచారణ

- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్
- పోలీస్ స్పందనలో 64 అర్జీలు


స్పందనలో అర్జీలు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: స్పందన ఫిర్యాదులను సత్వర విచారణ జరిపి చట్టపరంగా బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి స్పందనకు వచ్చిన ప్రజల వినతులను స్వీకరించి ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థికపరమైన అంశాలు, ఇతర సమస్యలతో మొత్తం 64 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను స్వయంగా జిల్లా ఎస్పీ విన్నవించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. స్పందనలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ మాలకొండయ్య పాల్గొన్నారు.

భర్తను హతమార్చిన భార్య

- మద్యానికి బానిసై వేధిస్తుండడంతో ఈ ఘాతుకం
- సహకరించిన మృతుని తల్లి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ఫిరోజ్, ఎస్ఐ అనూక్

యద్దనపూడి: మద్యానికి బానిసైన భర్త ప్రతి రోజూ ఇంట్లో గొడవ పడుతుండటంతో సహనం కోల్పోయిన భార్య తన అత్తతో కలిసి భర్తను హత్య చేసిన సంఘటన బాపట్ల జిల్లా యద్దనపూడి మండలంలోని యనమదల గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రాయి చెన్నయ్య (42) యద్దనపూడిలో యూనియన్ బ్యాంకులో నగదు లావాదేవీలు నిర్వహించే తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై భార్య కవితతో, తల్లి వెంకాయమ్మతో గొడవ పడుతు ఉంటాడు. ఈ విషయంపై పద్ధతి మార్చుకోవాలని అతని భార్య, తల్లి ఎన్ని ఎన్నిసార్లు చెప్పినా మారలేదు. ఎప్పటిలాగే ఆదివారం తప్పతాగి ఇంటికి వచ్చిన చెన్నయ్య భార్య, తల్లితో గొడవ పడ్డాడు. తల్లి ఎంత సర్దిచెప్పినా వినిపించుకోలేదు. ఇతని బాధను భరించలేక మట్టుబెట్టాలని నిర్ణయించుకున్న అత్తాకోడళ్లు ఇద్దరూ కలిసి నిద్రిస్తున్న చెన్నయ్య మెడకు వైరు బిగించి చంపేశారు. అనంతరం ఇరుగుపొరుగు వారికి ఉరేసుకొని చనిపోయాడంటూ నమ్మించే ప్రయత్నం చేశారు. అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ ఫిరోజ్, ఎస్ఐ అనూక్‌లు మృతదేహాన్ని పరిశీలించారు. ఒంటిపై గాయాలు ఉండటంతో అనుమానం వచ్చిన పోలీసులు అత్తాకోడళ్లను తమదైన శైలిలో విచారించారు. చెన్నయ్యను తామే చంపినట్లు నిజం ఒప్పుకోవటంతో వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి హత్యకు గురికావటం, తల్లిని, నాయనమ్మను పోలీసులు అదుపులోకి తీసుకోవటంతో వారి పిల్లలు భవానికేశవ, శాలిని, హేమ దిక్కులేని వారయ్యారు. వారు ప్రస్తుతం 10, 9, 7 తరగతులు చదువుతున్నారు.

విత్తన సమృద్ధి సాధించడమే లక్ష్యం


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ ఉప సంచాలకులు విజయనిర్మల

అద్దంకి రూరల్: రైతులు విత్తన సమృద్ధి సాధించడమే గ్రామ విత్తన పథకం లక్ష్యమని జిల్లా వ్యవసాయ ఉప సంచాలకులు విజయనిర్మల అన్నారు. సోమవారం మండలంలోని శంఖవరప్పాడు ఆర్‌బీకే వద్ద నిర్వహించిన విత్తన పథకంపై శిక్షణ కార్యక్రమంలో ఆమె వివరించారు. ఏరువాక కేంద్రం బాపట్ల శాస్త్రవేత్త సురేఖాదేవి మాట్లాడుతూ సూడోమోనాస్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట సాగు ద్వారా భూమిలో సేంద్రియ కర్బనం పెంపొందించుకోవచ్చని తెలిపారు. ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. సహాయ వ్యవసాయ సంచాలకుడు ధనరాజ్, ఏఓ వెంకటకృష్ణ, వీఏఏ ప్రియాంక, వీఆర్వో ప్రియాంక ఏఈఓ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు చీరాలకు మంత్రి సత్యనారాయణ రాక

చీరాల: నియోజకవర్గంలో అభివృద్ధి, సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించేందుకు మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ చీరాల రానున్నారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అధ్యక్షతన నియోజకవర్గ సమస్యలపై మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం హాలులో సమీక్ష సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తితో పాటు జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని తెలిపారు.

రేపు బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సదస్సు

బాపట్ల: బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తునట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో పాల్గొనే వారు జేటీఓ ఎం.రమేష్‌బాబు 9491308072ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు.

డ్రైవర్‌పై దాడికి నిరసనగా బస్సులు నిలిపివేత

- విజయవాడలో చీరాల ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్‌పై దాడి
- ఆర్టీసీ అధికారుల చర్చల అనంతరం కదిలిన బస్సులు


బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న హైర్ బస్ సిబ్బంది

చీరాల అర్బన్: విజయవాడ నుంచి చీరాల వస్తున్న హైర్ బస్సులో విజయవాడ వద్ద ఆదివారం డ్రైవర్, ప్రయాణికుడికి మధ్య జరిగిన వాదులాటలో డ్రైవర్‌పై ప్రయాణికుడు దాడి చేశాడు. ఈ నేపథ్యంలో దాడికి నిరసనగా సోమవారం చీరాల డిపోలో హైర్ బస్ డ్రైవర్లు, సిబ్బంది ఆందోళనకు దిగారు. దీంతో మధ్యాహ్నం వరకు హైర్ బస్సులు బస్టాండ్‌లోనే నిలిచిపోయాయి. ఆర్టీసీ ఉన్నతాధికారులు జరిపిన చర్చలు సఫలం కావడంతో మధ్యాహ్నం నుంచి యథావిధిగా బస్సులు బయటకు వచ్చాయి. వివరాల్లోకి వెళితే.. చీరాల డిపోకు చెందిన హైర్ బస్సు ఆదివారం విజయవాడ నుంచి చీరాలకు బయలుదేరింది. బందరురోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో డ్రైవర్ శివయ్య బస్సును వారధి వద్ద ఆపాడు. వారధి వద్ద బస్సు ఎక్కిన శ్రీనివాసరావు దురుసుగా ప్రవర్తించాడు. ఇరువురికి మధ్య జరిగిన వాదులాటలో శ్రీనివాసరావు డ్రైవర్ శివయ్యపై దాడి చేశాడని బస్సులోని ప్రయాణికులు డీఎంకు తెలిపారు. దాడిలో గాయపడిన డ్రైవర్ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అలానే శ్రీనివాసరావు కూడా డిపో మేనేజర్‌కు డ్రైవర్‌పై ఫిర్యాదు చేశాడు.

ఆందోళన చేపట్టిన హైర్ బస్ డ్రైవర్లు..

హైర్ బస్‌లో డ్రైవర్‌పై దుర్భాషలాడుతూ దాడి చేసి గాయపరచిన యు.శ్రీనివాసరావును అరెస్టు చేయాలని కోరుతూ సోమవారం హైర్ బస్సుల డ్రైవర్లు, సిబ్బంది బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. సీఐటీయూ నేత ఎం.వసంతరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అంతేకాకుండా హైర్ బస్సుల డ్రైవర్లు బస్సులను నిలిపివేశారు. చీరాల డిపో నుంచి విజయవాడ, ఒంగోలు, నర్సరావుపేటకు వెళ్లే హైర్ బస్సులు 35 నిలిచిపోయాయి. అయితే సోమవారం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయంగా బస్సులను నడిపారు. ఈఘటనపై ఆర్టీసీ అధికారులు, సీఐటీయూ నాయకులు చర్చలు నిర్వహించారు. చర్చలు సఫలం కావడంతో మధ్యాహ్నం నుంచి యథావిధిగా నడిచాయి.

సాగులో సందేహాలను నివృత్తి చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ సత్తార్


ఏఓలకు సూచనలిస్తున్న డీఏఓ అబ్దుల్ సత్తార్

రేపల్లె: రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటూ సాగులో కలిగే సందేహాలను నివృత్తిచేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ సత్తార్ తెలిపారు. వివిధ వ్యవసాయ అంశాలపై స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రేపల్లె, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల వ్యవసాయ అధికారులకు సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంట వివరాలు రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేయించుకునేలా అధికారులు రైతులను చైతన్య పరచాలన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టం వాటిల్లిన రైతులను ఆదుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులు మాత్రమే ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఆర్‌బీకేల ద్వారా అందించే ఎరువులు, యంత్ర పరికరాలకు అర్హులు అవుతారని తెలియజెప్పాలన్నారు. అనంతరం ఆయా అంశాలపై వ్యవసాయ అధికారులకు శిక్షణనిచ్చారు. ఏడీఏ అక్తర్ హుస్సేన్, ఏఓలు శారద, వాగోలు బుష్, ఏఈఓలు పాల్గొన్నారు.

తెల్లదోమ నివారణపై జాగ్రత్తలు అవసరం

పర్చూరు (చినగంజాం): పత్తి రైతులు తెల్లదోమ నివారణపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సురేఖ అన్నారు. మండలంలోని నూతలపాడు గ్రామంలో పత్తి పంట సాగు చేసే పొలాన్ని సోమవారం జిల్లా వనరుల విభాగం డీడీఏ ఎం.విజయనిర్మల, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ ఎం.ఓబయ్య, శాస్త్రవేత్త డాక్టర్ సురేఖ సందర్శించి పరిశీలించారు. థయోమిథాక్సామ్ (యాంత్రా), ఫ్లోనికామిడ్ (ఉలాల) మందును పిచికారీ చేయొద్దన్నారు. ఒక వేళ పిచికారీ చేస్తే తెల్లదోమ ఉధృతి పెరుగుతుందని, తెల్లదోమ నివారణపై అప్రమత్తంగా ఉండాలని ఆమె తెలియజేశారు. పత్తి పంటలో రసం పీల్చే పచ్చదోమ, తామర పురుగులు నివారణకు డయాఫెంథియురాన్ 1.25 (పెగాసస్, పోలో) గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అదే విధంగా రైతులు వేప నూనెను 400 ఎంఎల్ ఒక ఎకరానికి పిచికారీ చేయాలని, మెగ్నీషియం, బోరాన్ లోపం గుర్తిస్తే సల్ఫేట్, బోరాన్ పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వీరితో పాటు పర్చూరు ఏఓ ఎస్.రామ్మోహనరెడ్డి, సీహెచ్ మధుమోహన్, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో పెట్రోల్ బంక్‌కు శంకుస్థాపన


శిలా ఫలకాన్ని, ఎఫ్ఐసీటీసీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న హరీష్ కుమార్ గుప్తా

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా జైలులో జైళ్ల శాఖ, హెచ్‌పీసీఎల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పెట్రోలు బంక్ నిర్మాణానికి హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా సోమవారం భూమి పూజ నిర్వహించి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కారాగారంలోని ముద్దాయిలకు వ్యాధుల నిర్ధారణ నిమిత్తం వివిధ రక్త పరీక్షల ల్యాబ్, ఎఫ్ఐసీటీసీ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు రేంజ్ జైళ్ల ఉప శాఖాధికారి ఎం.వరప్రసాద్, హెచ్‌పీసీఎల్ సౌత్ సెంట్రల్ జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.కాశీ విశ్వనాథం, చీఫ్ రీజినల్ మేనేజర్ రిటైల్ ఆదిత్యనాథ్, చీఫ్ మేనేజర్ విల్సన్ బాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్.ఈ. రెబ్బా అంబేడ్కర్, జిల్లా జైలు పర్యవేక్షణాధికారి కె.రఘు, జిల్లా సబ్ జైళ్ల అధికారి ఆర్.వీరేంద్ర ప్రసాద్, కారాగార వైద్యాధికారి కె.లక్ష్మీ పూర్ణలత, జైలర్లు బి.తేజేశ్వరరావు, సీహెచ్ కిరణ్, ప్రేమ సాగర్, డిప్యూటీ జైలర్లు టి.వెంకటరత్నం, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎల్ఎస్ఏ కార్యకలాపాలపై పీడీజే సమీక్ష

గుంటూరు లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యకలాపాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి (పీడీజే) వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి సోమవారం తన ఛాంబర్‌లో సమీక్షించారు. నల్సా కార్యక్రమంలో భాగంగా నిర్వహించే లోక్ అదాలత్‌లు, లీగల్ ఎయిడ్ క్యాంపులు, బాధితులకు నష్ట పరిహారం చెల్లింపు తదితర అంశాలకు సంబంధించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు అందించారు. సమీక్షా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రమౌళీశ్వరి, డీఎల్ఎస్ఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్.. మహిళ మృతి

8 మందికి గాయాలు


సలోమి మృతదేహం

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా 8 మందికి గాయాలైన సంఘటన సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామం వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. క్రోసూరు మండలం 88 త్యాళ్లూరుకు చెందిన గ్రామస్తులు గుంటూరు సమీపంలోని దాసరిపాలెం వద్ద చర్చి ప్రారంభోత్సవానికి హాజరయ్యేందుకు ఆటోలో వెళ్లారు. తిరిగి ఆటోలో 88 త్యాళ్లూరు వస్తుండగా పాకాలపాడు సమీపంలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీ కొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో మాలిశెట్టి సలోమి (38) అక్కడికక్కడే మృతి చెందగా, 8 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

- భర్త, కుమారుడికి తీవ్రగాయాలు
- కుమారుడిని కళాశాలలో దింపేందుకు వెళుతుండగా ఘటన


సంఘటనా స్థలంలో మంగమ్మ మృతదేహం

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళ్లిపాళ్ల సమీపంలోని బృగుబండ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గద్దం కోటేశ్వరరావు, ఆయన భార్య గద్దం పున్నమ్మ (48), కుమారుడు రవి కిషోర్‌లు ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళుతున్నారు. గుంటూరులో తమ కుమారుడు రవికిషోర్ బీటెక్ చదువుతుండగా ఆ కళాశాలలో దింపేందుకు వెళుతున్నారు. ఈ క్రమంలో సత్తెనపల్లి నుంచి కారు బృగుబండ గ్రామం వైపు వెళుతుంది. బృగుబండ క్రాస్ రోడ్ వద్ద కారును ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో పున్నమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కోటేశ్వరరావుకు, కుమారుడు రవి కిషోర్‌కు తీవ్ర గాయాలు కావడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తమ కళ్లముందే భార్య మృతి చెందడంతో పాటు కుమారుడికి, తనకు తీవ్రగాయాలు కావడంతో కోటేశ్వరరావు కన్నీరుమున్నీరయ్యారు. ఆయన రోదన చూపరులకు సైతం కంటతడి పెట్టించింది.

ఆట్యా-పాట్యా రాష్ట్రస్థాయి విజేతలుగా జిల్లా జట్లు



విజేతగా నిలిచిన జిల్లా బాలుర జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి ఆట్యా - పాట్యా పోటీలలో పల్నాడు జిల్లా బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. ఈనెల 18వ తేదీ నుంచి 20వరకు కర్నూలులో జరిగిన 8వ రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా పోటీల ఫైనల్లో బాలుర, బాలికల జట్లు అనకాపల్లి జట్లపై విజయం సాధించి చాంపియన్‌గా నిలిచాయి. విజేతలుగా నిలిచిన జిల్లా జట్లకు న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు ట్రోఫీలతో పాటు పతకాలు అందజేశారు. జిల్లా జట్ల కోచ్‌లుగా సిహెచ్ పుల్లయ్య, జి.ఝాన్సీరాణిలు వ్యవహరించారు.

కేఎల్‌యూలో న్యూరో సైన్స్ కార్యశాల


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అనితా మహదేవన్, డాక్టర్ కె.ఎస్. జగన్నాధరావు, డాక్టర్ కె. సుబ్బారావు

తాడేపల్లిరూరల్ : గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ న్యూరో సైన్స్ కార్యశాలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్, మైసూర్ జెఎస్ఎస్ మెడికల్ కళాశాల ఆచార్యులు డాక్టర్ టీఎస్ఎస్ రావు, బెంగళూరులోని నిమ్‌హాన్స్ మానవ మెదడు బ్యాంక్ డైరెక్టర్ అనితా మహదేవన్, హనుమ శ్రీనివాసరెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

ఈ సందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ మెదడులా పని చేసే విధంగా మదర్‌బోర్డు రూపకల్పనకు ఇప్పటికే రోడ్‌మ్యాప్ సిద్ధమైందన్నారు. మానవులకు ఉన్న విధంగా భావోద్వేగాలు లేనప్పటికీ యాంత్రికంగా అవయవాలను కదిలించడం, పనిచేయడం వంటి పలు రకాల పరిశోధనలు ఇప్పటికే విజయవంతమైనాయన్నారు. కె.ఎల్.వర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ కెఎస్ జగన్నాధరావు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుతో మానవ మెదడులో తలెత్తే సమస్యలకు పరిష్కారం కనుగొనడానికి ప్రపంచస్థాయిలో జరుగుతున్న పరిశోధనల కోసం కేఎల్‌యూలో అంతర్జాతీయ కార్యశాల నిర్వహించడం కోసం చైర్మన్ కోనేరు సత్యనారాయణ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని, ఈ కార్యశాల ఐదు రోజుల పాటు నిర్వహించనున్నా మన్నారు. అనంతరం ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్, మైసూర్ జెఎస్ఎస్ మెడికల్ కళాశాల ఆచార్యులు డాక్టర్ టీఎస్ఎస్ రావు, డాక్టర్ మురళీధర్ హెగ్డే, జపాన్‌కు చెందిన శామ్యూల్ జెకె అబ్రహాం, డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి, హనుమ శ్రీనివాసరెడ్డి, బెంగళూరులోని నిమ్‌హాన్స్ మానవ మెదడు బ్యాంక్ డైరెక్టర్ అనితా మహదేవన్‌లను సర్‌సివి రామన్ అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. శ్రీనివాసులు, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ ఎం. సుమన్, కార్యక్రమ ముఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ ఎం. వసుజాదేవి, కో ఆర్డినేటర్లు ఆచార్యులు శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మి సౌమ్య, సోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సత్వరమే పూర్తిచేయండి

నరసరావుపేట: మంచి గుర్తింపు వచ్చేలా ప్రగతి పథకాల పనులను నిర్దిష్ట కాల పరిమితిలోపు పూర్తి చేయడం, నిరంతర పనులను సత్వరం కొనసాగించడం చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లా అధికారులతో సమీక్ష, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనితీరుపై చర్చించారు. ప్రధానంగా జిల్లాలో ఎంతమంది గర్భిణులు వైఎస్సార్ సంపూర్ణ పోషణ తీసుకుంటున్నారని ప్రశ్నించి, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. టేక్ హోమ్ రేషన్ ద్వారా ప్రతీ ఇంటికీ రేషన్ పంపిణీ కార్యక్రమంపై ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ అమలులో వెనుకబడ్డ మండలాలను ప్రోగ్రెస్‌లోని తీసుకురావాలని, ప్రతి ఇంటికి తిరిగి ఫీవర్ సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. గృహ నిర్మాణ పథకాలలో జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుంటూ లబ్ధిదారుల ఇళ్లకు మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సంబంధించిన సర్వేను పూర్తిచేసి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఐరన్ ఫోలిక్ మాత్రలు జిల్లావ్యాప్తంగా అన్ని స్కూళ్లలో పంపిణీ చేసి బాలికలు వేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.